క్లుప్తంగా

నేడు కేవీలో డ్రాయింగ్ పోటీలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మృదుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పరాక్రమ్ దివస్‌లో భాగంగా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెయింటింగ్, క్విజ్ పోటీలు



కాజీపేట రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగుల పిల్లలకు పెయిటింగ్, క్విజ్, వ్యాసరచన పోటీలను ఆదివారం నిర్వహించారు. కమిటీ సభ్యుడు దరావత్ రఘు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ రాజయ్య, ట్రెజరర్ రాజేశ్వరరావు సభ్యులు ప్రవీణ్, ప్రశాంత్, మాధవరావు, సంఘ నాయకులు మురళి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు సహకరించాలి



కాజీపేట: మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆటో డ్రైవర్లు తమ విధానాన్ని మార్చుకుని పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. పలు గ్రామాల వెళ్లే ఆటోలకు కాజీపేట చౌరస్తాకు సమీపంలో గాయత్రి స్వీట్ హౌస్ పక్కన అడ్డాను కేటాయించి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ఆటోలు ఆపడం వల్ల ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ధర్మసాగర్, రాంపూర్, మడికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే ఆటోలు విధిగా అడ్డాపైనే ఉండాలని పేర్కొన్నారు. ఈమేరకు సీఐని ఆటో డ్రైవర్లు సన్మానించారు.

భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఖిలా వరంగల్: విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం సూచించారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్, మానిఫెస్ట్ మోడల్ యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంట్ సిద్దార్థ ఆధ్వర్యంలో మానిఫెస్ట్ మోడల్ యునైటెడ్ నేషన్స్ ఈవెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి నమూనాను ఏర్పాటు చేసి 80మంది విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధుల హోదాలో కూర్చొని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో సయ్యద్ మోయిద్, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మైనార్టీలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలో ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి జరిగిన మైనార్టీల సమావేశానికి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ముస్లిం, మైనార్టీ నాయకులు కలిశారు. పెట్రోల్‌బంక్ జంక్షన్ ఈద్గా పక్క స్థలంలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై ఎమ్మెల్యేను నాయకులు నిలదీశారు. దాంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గత ఎమ్మెల్యే నిధులు కేటాయించారని గుర్తుచేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మించొద్దని ముస్లిం, మైనార్టీ నేతలు అధికారులకు వినతిపత్రం అందజేయడంతో ప్రస్తుతం పనులు నిలిపివేసినట్లు ఎమ్మెల్యే నరేందర్ తెలిపారు.

ఆశ్రమ వృద్ధులకు కంటి ఆపరేషన్



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పెద్దమ్మగడ్డ శివారులోని స్వయంకృషి మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలోని వృద్ధులకు అజరా ఆస్పత్రిలో దాతల సాయంతో ఆదివారం కంటి ఆపరేషన్ చేసి అద్దాలను అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు తీగల శోభ ప్రత్యేక చొరవతో 12మందికి దాతల చేయూతతో ఉచితంగా ఆపరేషన్ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవీంద్ర, వేణుగోపాల్, దాతలు అజరా ఆస్పత్రి సీజీఎం రవిచంద్ర, సీఈఓ వెంకటేష్, వేణుగోపాల్ సెల్వరాజ్, సైదా, రాజామోహన్, ఆశ్రమ నిర్వాహకురాలు అనిత, రాధ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హసన్‌పర్తి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మడికొండలోని పాఠశాలలో..



న్యూశాయంపేట: గురువులతో పూర్వ విద్యార్థులు



వరంగల్: సీకేఎం కళాశాలలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నగరవ్యాప్తంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను సన్మానించారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2000 – 2001లో ఎస్సెస్సీ బ్యాచ్, మడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1968 –69లో పదవ తరగతి, కరీమాబాద్ దసరారోడ్డులోని శ్రీవెంకటేశ్వర పాఠశాల అమ్మగారు బడిలో, దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో 1991 –1994లో డిగ్రీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.

– హసన్‌పర్తి / మడికొండ / న్యూశాయంపేట / వరంగల్

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: ఎస్సీ వర్గకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల సహాయమంత్రి బి.ఎల్.వర్మకు వినతిపత్రం అందజేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కేంద్ర మంత్రిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కేంద్రం ఇచ్చిన హామీ అమలయ్యేలా చూడాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్‌మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు జన్ను దినేష్‌మాదిగ, మంద రాజుమాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, వస్కుల ప్రణయ్ మాదిగ, మంద వర్ధన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఆగయ్య సేవలు చిరస్మరణీయం



ఖిలా వరంగల్: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత, తెలంగాణ ఉద్యమ నాయకుడు దివంగత బండి ఆగయ్య సేవలు చిరస్మరణీయమని న్యూడెమోక్రసీ నగర నేత రాచర్ల బాలరాజు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకురాలు నిర్మలక్క కొనియాడారు. వరంగల్ పడమరకోటలో బండి కోటేశ్వరరావు అధ్యక్షతన ఆగయ్య సంతాప సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆగయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర నేత బెల్లంకొండ రమేష్, నలిగంటి చంద్రమౌళి, నలిగంటి పాల్, తీగల జీవన్, బొడ్డు కుమారస్వామి, ఇనుమల కృష్ణ, హరిబాబు పాల్గొన్నారు.

‘భూకబ్జాలకు పాల్పడుతున్న పాలకులు’



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా /హన్మకొండ అర్బన్: భూకబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించే సమయం దగ్గర్లోనే ఉందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. హనుమకొండలోని కొత్తబస్టాండ్‌కు వెళ్లే దారిలో హనుమాన్ టెంపుల్ కూడలిలో బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్ నగరంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులే భూబకాసురులుగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ మురళీధర్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, నాయకులు కల్లూరి పవన్, సదానందం, కిషన్, శ్రీనివాస్, మధుసూదన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడ కులస్తుల అభివృద్ధే జేఏసీ లక్ష్యం



కేయూ క్యాంపస్: గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే గౌడ జేఏసీ లక్ష్యమని, ఈక్రమంలో ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని గౌడ సంఘాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు యాదగిరి గౌడ్, జనగామ శ్రీనివాస్, అనంతుల రమేష్, గట్టు రమేష్ సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో గౌడ సంఘాల జేఏసీ సమావేశాన్ని పులి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందున్న గౌడ కులస్తులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో 18శాతం ఉన్న గౌడ కులస్తులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని వాపోయారు. సమావేశంలో రాజ్‌కుమార్, రంజిత్, మాచర్ల శరత్, ఏరుకొండ శ్రీనివాస్, రవీందర్, వినోద్‌కుమార్, భాస్కర్, వెంకటేశ్వర్లు, భిక్షపతి పాల్గొన్నారు.

సమష్టి పొదుపుతో సంఘం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌బాబు

ఖిలా వరంగల్: సంఘ సభ్యుల సమష్టి పొదుపుతో నేతాజీ ఆదర్శ పరపతి సంఘం అభివృద్ధి చెందిందని సంఘ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు తెలిపారు. వరంగల్ కరీమాబాద్ ప్రధాన రోడ్డులోని నేతాజీ ఆదర్శ పొదుపు, పరపతి పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ భవనంలో ప్రధాన కార్యదర్శి మండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంఘ 58వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సంజయ్‌బాబు మాట్లాడుతూ ప్రతిసభ్యుడి ఆర్థికశక్తి పెంచేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘ కోశాధికారి బైరి దయాసాగర్ వార్షిక నివేదికను సభ్యుల ముందు ప్రవేశ పెట్టగా సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సూరనేని రామారావు, బత్తిని చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వంగరి కోటేశ్వర్, పొగాకు జ్ఞానయ్య, కొండూరు శివప్రసాద్, గట్టు రమేష్, కూరపాటి భిక్షపతి, గోగికార్ కిషోర్‌కుమార్, పొగాకు సందీప్, నాగపురి అశోక్, పాటి రవీందర్, అన్న రాజేశం, వెలిదె శివమూర్తి మండ శ్యాం, సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుల కవితా సదస్సు



సదస్సులో పాల్గొన్న తెలుగు ఉపాధ్యాయులు

హన్మకొండ కల్చరల్: పోతన విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయుల కవితా సదస్సును ఘనంగా నిర్వహించారు. వరంగల్‌లోని పోతన విజ్ఞానపీఠంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి పీఠం కార్యదర్శి గండె శ్రీనివాస్ సభాధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా ఆంధ్ర బాలిక జూనియర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. తెలుగుభాషలోని మెలకువలను గండె శ్రీనివాస్ వివరించారు. తెలుగుభాషకు సంబంధించిన కార్యక్రమాలను ప్రతినెలా నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు పాల్గొని తెలుగు కవితలు, గేయాలు, పద్యాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో పీఠం కార్యవర్గ సభ్యుడు జూలూరి నాగరాజు, మేనేజర్ జేఎస్.శర్మ వందన సమర్పణ చేశారు.

సంక్షిప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం

హసన్‌పర్తి: నగరంలోని ఒకటవ డివిజన్ పలివేల్పులలో వడ్డెపల్లి పశు వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో గర్భకోశ వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది రాకేష్, యాదలక్ష్మి, కొమురయ్య, వంశీ పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి



హన్మకొండ అర్బన్: సంఘటితంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో పోస్టల్‌కాలనీ రెడ్డి పరపతి సంఘం వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవు జైపాల్‌రెడ్డి, నల్ల రాజరెడ్డి, నాయకులు కంది గోపాల్‌రెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, తాటిపల్లి గణపతిరెడ్డి, నరసింహరెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, కృష్ణవేణిరెడ్డి, మంజులారెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి వివాహ ఆహ్వానం

వరంగల్: తన కుమార్తె వివాహానికి రావాలని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకుడు బాషపాక సదానందం ఆహ్వానించారు. గాంధీభవన్‌లో ప్రచార కమిటీ కన్వీనర్ అజ్మతుల్లా హుస్సేని మహ్మద్ అయూబ్‌లతో కలిసి రేవంత్‌రెడ్డితోపాటు నేతలు భట్టి విక్రమార్క, రాష్ట్ర విభాగం అధ్యక్షుడు ప్రీతంలకు ఆదివారం వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో రాజు, జన్ను జీవన్, కిషన్, శరత్, మహేందర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ విగ్రహానికి జలాభిషేకం

ఖిలా వరంగల్: వరంగల్ మధ్యకోటలోని ఎల్లమ్మ గుడిలోని విగ్రహానికి స్థానిక మహిళలు ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. విగ్రహ పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఎల్లమ్మ ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున నీళ్ల బిందెలతో చేరుకుని అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం చేశారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని జిల్లా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ మినాజ్, మహ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. హనుమకొండ ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతినెల మూడవ ఆదివారం సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని సమస్యలను వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ దృష్టి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో ఎంఏ.సుల్తాన్, ఎంఏ.తన్వీర్, హమీద్, నూరొద్దీన్, జుబేర్ పాల్గొన్నారు.

పరపతి సంఘాలతో ఆర్థిక పరిపుష్టి



బంగారు బిస్కెట్లను అందజేస్తున్న మేయర్

హసన్‌పర్తి: పరపతి సంఘాల ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధ్యమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. హసన్‌పర్తిలోని భక్త మార్కండేయ పరపతి సంఘం 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాన్ని ఏకతాటిపై విజయవంతంగా నడుపుతున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఈమేరకు సంఘం సభ్యులకు పదిగ్రాముల బంగారు బిస్కెట్లను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, సంఘం సభ్యులు దాసరి శ్రీనివాస్, కనుకుంట్ల సతీష్, రాకేష్, దీకొండ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పూలే బీసీ భవన్ నిర్మాణానికి చీఫ్‌విప్ హామీ

హన్మకొండ: హనుమకొండలో పూలే బీసీ భవన్ నిర్మాణానికి ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్ హామీ ఇచ్చారని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు తెలిపారు. హనుమకొండలోని సర్క్యూట్ హౌస్‌లో చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను బీసీ కుల సంఘాల నాయకులు కలిసి పూలే బీసీ భవనాన్ని నిర్మించాలని కోరుతూ ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ సానుకూలంగా స్పందించి పూలే బీసీ భవన్ నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చినట్లు శేషు వివరించారు. అదే విధంగా కేయూ జంక్షన్‌లో బి.పి.మండల్ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తారని తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమిడి అంజన్‌రావు, ఎర్రోళ్ల భిక్షపతి, నూతనకంటి ఆనందం, పల్లెపు సమ్మయ్య, దారబోయిన సతీష్ యాదవ్, యశ్వంత్ యాదవ్, సురేందర్, సదానందం, వినయ్‌చారి, డేనియల్, నరేందర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బీఎల్ వర్మకు సన్మానం



వర్మను సన్మానిస్తున్న బాబురావు

కాజీపేట అర్బన్: బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా న్యూశాయంపేటకు విచ్చేసిన ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి బీఎల్.వర్మకు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మామిండ్ల బాబురావు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని సన్మానించి, న్యూశాయంపేటలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్పొరేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సర్కారు పెద్దపీట



హన్మకొండ: చెక్కులను అందిస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ: పేదల వైద్యానికి సర్కారు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని సర్క్యూట్ హౌస్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆరుగురు లబ్ధిదారులకు రూ.10 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న అనేకమంది పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక వెసులుబాటు అందుతోందని చెప్పారు. కార్పొరేటర్లు ఎలకంటి రాములు, మామిండ్ల రాజు, టీఆర్ఎస్ నాయకులు మాడిశెట్టి శివ శంకర్, నయీమొద్దీన్, సమద్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

కాజీపేట రూరల్: ఎస్‌టీఎఫ్ఐలో స్కూల్ గేమ్‌లో అర్హత సాధించిన కుంగ్‌ఫూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని చీఫ్‌విప్ అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీ సెమినార్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు కంటేశ్వర్, మాస్టర్లు కిషోర్, కుమారస్వామి, సతీష్, సారయ్య, శ్యామ్‌కుమార్, కృష్ణ, రామకృష్ణ, పాపారావు, విశ్వ, సోని, కళ్యాణి పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక భరోసా.. సీఎంఆర్ఎఫ్



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

హసన్‌పర్తి: పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి.. ఆర్థిక భరోసా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 55వ డివిజన్ భీమారానికి చెందిన విజయలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా, రూ.లక్ష ఎల్ఓసీని హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన నివాసంలో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రజిత, కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 5నుంచి 8వరకు హైదరాబాద్‌లోని ఖుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో హనుమకొండ డీఎస్ఏ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కబ్స్ ఏజ్ గ్రూప్‌లో 36, 38 కిలోల విభాగంలో ఎస్‌కె.షోయేబ్.. బ్రాంజ్ మెడల్ సాధించగా, 38, 40 కిలోల విభాగంలో అక్షయ్‌ఖాన్ బ్రాంజ్, 40, 42 కిలోల విభాగంలో ఎస్‌కె.రిజ్వాన్ సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో ఎస్‌కె.షాహెద్ బంగారు, 71కిలోల విభాగంలో కార్తికేయ బంగారు, 77కిలోల విభాగంలో శివ బంగారు పతకాన్ని సాధించారు. ఈమేరకు క్రీడాకారులతో పాటు డీఎస్ఏ కోచ్ సందెల శ్యాంసన్‌ను వరంగల్ మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య అభినందించారు.

నియామకం, ఎన్నిక

వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలోని వడ్డెపల్లి రిజర్వాయర్ ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీ అధ్యక్షుడిగా ఎ.రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎండి.మహమూద్ అలీ, జె.శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా బి.రాజేశ్వర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కైలాస్‌చంద్ర అగర్వాల్ ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహణాధికారిగా జి.రవీందర్ రెడ్డి వెల్లడించారు.

పరపతి సంఘం నూతన కార్యవర్గం



హసన్‌పర్తి: 66వ డివిజన్‌లోని శ్రీవెంకటేశ్వర పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లాల యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా పట్టం శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా వీసం తిరుపతిరెడ్డి, కోశాధికారిగా దాసరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా సదానందం



హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని యాదవ సంఘం అధ్యక్షుడిగా వేల్పుల సదానందం ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సంఘం ఎన్నికల్లో వేల్పుల సదానందంకు 117 ఓట్లు రాగా, వేల్పుల రమేష్‌కు 93 ఓట్లు వచ్చాయి.

భూకబ్జాదారులపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖిలా వరంగల్ గ్రామ శివారు దూపకుంట రోడ్డులోని పేదల ఇంటి స్థలాలను ఆక్రమించేందుకు ఓ కబ్జాదారుడు పలుమార్లు యత్నించాడు. ఈక్రమంలో భూ బాధితుల ఫిర్యాదు మేరకు బొల్లం రాజు, అతని అనుచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

అదుపుతప్పి బోల్తా పడిన కారు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని డీజిల్‌కాలనీ ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మడికొండ వైపు నుంచి కాజీపేటకు వస్తున్న కారు.. అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దాంతో వాహనం పల్టీలు కొట్టడంతో ధ్వంసమైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇంకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయని కారణంగా వివరాలు అందలేదని ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

రైల్వే క్రికెట్ పోటీలు భేష్

కాజీపేట రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు భేష్ అని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి, డీజిల్‌షెడ్ బ్రాంచీ సంఘ్ సెక్రటరీ ఎ.మధుసూదన్, ఎల్ఆర్ఎం బ్రాంచీ వర్కింగ్ చైర్మన్ ఎం.రాజు, ఆపరేటింగ్ బ్రాంచీ చైర్మన్ కె.నర్సింగరావు అన్నారు. కాగా, క్రికెట్ పోటీలు ఇంకా కొనసాగుతున్నాయి.